క్లుప్తంగా

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



ఇంజేడులో శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి వారికి పూజలు చేస్తున్న అర్చకులు

ఉయ్యాలవాడ : మండలంలోని సుద్దమల్ల, ఇంజేడు, ఆర్.జంబులదిన్నె, ఉయ్యాలవాడ గ్రామాల్లో వెలిసిన ఆలయాల్లో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ లక్ష్మీనరసింహ కంబగిరి స్వామి, శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి, శ్రీ అభయాంజనేయస్వామి వార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమార్చన, ఆకుపూజలు చేశారు. అర్చకులు కమలేష్‌శర్మ, అనంతయ్య, లక్ష్మణస్వామి, భాస్కరశర్మలు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

బొట్టు బిల్లలతో అంబేడ్కర్ చిత్రం



అంబేడ్కర్ చిత్రంతో సాయిహావీస్

నంద్యాల(అర్బన్): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని పట్టణానికి చెందిన 6వ తరగతి విద్యార్థి సాయి హావీస్ 2,960 బొట్టుబిల్లలతో అంబేడ్కర్ చిత్రాన్ని గీచింది. కోటేష్ అకాడమీకి చెందిన చిన్నారి 14 అంగుళాల పొడవు, పది అంగులాల వెడల్పుగల డ్రాయింగ్ చార్ట్‌పై 0.2ఎంఎం సైజుగల బొట్టు బిల్లలను చిత్రాన్ని రూపొందించింది.

ఉగాది క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా

నంద్యాల(అర్బన్): శ్రీక్రోధి నామ సంవత్సర త్రైత సిద్ధాంత ఉగాది తెలుగు క్యాలెండర్‌ను ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి ఆవిష్కరించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం శ్రీ ఆచార్య ప్రబోధా నంద యోగీశ్వర ఆవిష్కరించిన క్యాలెండర్‌ను ఎంపీ, ఎమ్మెల్యే పలువురికి అందజేశారు. త్రైత సిద్ధాంతం -ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక నంద్యాల కమిటీ అధ్యక్షుడు రవిశేఖర్‌రెడ్డి, రామకృష్ణ, నాయుడు, రామకృష్ణారెడ్డి, జయచంద్ర, గంగాధర్ పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామికి విశేష పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

రుద్రవరం: అప్పనపల్లె దారిలో వెలసిన లక్ష్మీ,గోదా సమేత వాసాపురం వేంకటేశ్వర స్వామికి శనివారం భక్తులు విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు ఉదయాన్నే స్వామి అమ్మవార్లకు నిత్య పూజల అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

వైభవంగా వసంత నవరాత్రులు



సీతా,రామ,లక్ష్మణ ఉత్సమూర్తులకు ఊంజల సేవ నిర్వహించిన దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): శ్రీరామనవమిని పురస్కరించుకొని స్థానిక సంజీవనగర్ రామాలయంలో శ్రీభగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం వసంత నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సీతారామ లక్ష్మణ ఉత్సవ మూర్తులకు ఊంజల్ సేవా జరిపించి మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అలాగే..ఎస్‌బీఐ కాలనీలోని రామాలయంలో శనివారం సాయంత్రం టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో శ్రీరామాయణం, సేవా ధర్మం అనే అంశంపై ప్రవచనకర్త మద్దయ్యస్వామి భక్తులకు వివరించారు. మల్లు వెంకటరెడ్డి, భార్గవ రామశర్మ పాల్గొన్నారు.

సీఎంపై దాడి హేయం

నంద్యాల(వ్యవసాయం): మేమంతా సిద్ధం బస్సు యాత్రలో భాగంగా విజయవాడలో పర్యటిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై దాడి హేయమైన చర్య అని వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ రాష్ట్ర నాయకుడు విజయశేఖర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ప్రతాపరెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో గెలవలేనని చంద్రబాబునాయుడు ఇటువంటి చర్యలకు పాల్పడటం పిరికిపంద చర్యగా అభివర్ణించారు. ఎన్ని కూటములు వచ్చినా జగనన్న విజయాన్ని ఆపలేరన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు ముక్కెర కృష్ణారెడ్డి, అశోక్‌కుమార్‌రెడ్డి, ఓబులరెడ్డి, శ్రీనివాసరెడ్డి, కృష్ణారెడ్డి, తిమ్మారెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



గంగుల ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి సమక్షంలో పార్టీలోకి తిరిగొచ్చిన కార్యకర్తలు

ఆళ్లగడ్డ: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, జలవనరుల శాఖ సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం వైఎస్సార్‌సీపీ నాయకులతో సమావేశమయ్యారు. మున్సిపాలిటీ పరిధిలోని కౌన్సిలర్లు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి పట్టణ పరిధిలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి పనులను ప్రణాళిక ప్రకారం వివరించాలని సూచించారు. అత్యధిక మెజార్టీ సాధించడమే లక్ష్యంగా పనిచేయాలని చెప్పారు. విజయ డెయిరీ చైర్మన్ ఎస్వీ జగన్‌మోహన్ రెడ్డి, గంగుల సుదర్శన్‌రెడ్డి, భూమా కిశోర్‌రెడ్డి, గంగుల విజయసింహారెడ్డి, సింగం వెంకటేశ్వర్‌రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు నరసింహారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నాయబ్‌రసూల్ ఉన్నారు.

తిరిగి సొంత గూటికి..

టీడీపీ నాయకుల మాయమాటలు నమ్మి ఆ పార్టీలో చేరిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు తిరిగి సొంత గూటికి చేరుకున్నారు. రుద్రవరం మండలం భూమా నాగిరెడ్డి పల్లె గ్రామానికి చెందిన పెద్ద ఓబులేసుతో పాటు మరి కొందరు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు శుక్రవారం టీడీపీ కండువా కప్పుకున్నారు. అయితే వీరు శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయం చేరుకుని గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి సమక్షంలో మళ్లీ వైఎస్సార్‌సీపీలో చేరారు. వారు మాట్లాడుతూ బలవంతంగా టీడీపీ కండువాలు వేసి ఫొటోలు తీసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము ఎప్పటికీ గంగుల కుటుంబానికి, వైఎస్సార్‌సీపీకి మద్దతుగా ఉంటామని చెప్పారు. పార్టీలో చేరిన వారిలో దుప్పన్న, బాలుగుర్రం, శివ ఓబులేసు, గుల్లెన్న, పెద్ద ఓబన్న, శివఎర్రక్క, కిరణ్, మనోహర్, నరసింహుడు, బాల నరసింహుడు, మధు, పుల్లయ్య, బాల ఓబులేసు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల

వైఎస్సార్‌సీపీ ప్రభంజనంలో కూటమి చిత్తు



ఎమ్మెల్యే శిల్పా రవిని ఆశీర్వదిస్తున్న వృద్ధురాలు



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల టౌన్: జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి వైఎస్సార్‌సీపీ ప్రభంజనంలో చిత్తవుతుందని, నిరర్థక వాగ్దానాలు చేస్తే ప్రజలు నమ్మే స్థితిలో లేరని కూటమి పార్టీలకు ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలని ఎమ్మెల్యే శిల్పా రవి చంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని 20వ వార్డు ఏకలవ్య నగర్, ఎన్జీవోస్ కాలనీలో వైఎస్సార్‌సీపీ నాయకులు దేశం సుధాకర్ రెడ్డి, కౌన్సిలర్ మురళీ, వార్డు ఇన్‌చార్జ్ ఆంజనేయులు, ఎమ్మెల్సీ ఇషాక్ బాషాతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా పోచా బ్రహ్మానందరెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. మున్సిపల్ వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, ఏపీ ఎస్సీడీసీఎల్ డైరెక్టర్ శశికలారెడ్డి, పోచా జనార్దన్ రెడ్డి,ఆర్‌జీఎం కళాశాల చైర్మన్ మిద్దె శివరాం, డాక్టర్స్ వింగ్ ఎస్ఎండీ రఫీ, గురురాజా కోచింగ్ సెంటర్ చైర్మన్ దస్తగిరిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ దాల్‌మిల్ అమీర్, నంద్యాల మూడవ పట్టణ అధ్యక్షుడు జాకీర్ హుస్సేన్, సాయిరాం రెడ్డి, వార్డు నాయకులు పాల్గొన్నారు.

గోస్పాడు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వల్ల ప్రజలకు మేలు జరిగి ఉంటే మళ్లీ ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాత్రమేనని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి అన్నారు. మండలంలోని ఎస్.నాగులవరం, నెహ్రూనగర్ గ్రామాల్లో రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డితో కలిసి శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నెహ్రూ నగర్‌లో తాడిపక్కిరరెడ్డి, తాడి శివారెడ్డి, చిన్న వెంకటసుబ్బారెడ్డి, కొండారెడ్డి కుటుంబాలతో పాటు 50 మంది ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేశారు. సోషల్ మీడియా అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, ఎంపీపీ ఆర్థర్ సైమాన్, సర్పంచ్‌లు శివరామిరెడ్డి, లక్ష్మీకాంతమ్మ, నాయకులు సుధాకర్ రెడ్డి, లింగారెడ్డి, కొండారెడ్డి, కృష్ణారెడ్డి, శివకుమార్ రెడ్డి, దేవన సతీష్ రెడ్డి, చంద్రమౌళీశ్వర రెడ్డి, అశోక్ కుమార్ రెడ్డి, భాస్కర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, జనార్దన్ రెడ్డి ఉన్నారు.

జగనన్నతోనే అభివృద్ధి సాధ్యం



ఉయ్యాలవాడలో ఓటు వేయాలంటూ అభ్యర్థిస్తున్న పోచా బ్రహ్మానందరెడ్డి

ఉయ్యాలవాడ : సంక్షేమ పథకాలు, అభివృద్ధి కొనసాగాలంటే మళ్లీ జగనన్నను సీఎంగా గెలిపించుకోవాలని వైఎస్సార్‌సీపీ నంద్యాల పార్లమెంట్ అభ్యర్థి పోచా బ్రహ్మానందరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రమైన ఉయ్యాలవాడలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల్లో మీ అమూల్యమైన ఓటులో ఒకటి ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అభ్యర్థి గంగుల బ్రిజేంద్రారెడ్డి, ఎంపీగా తనకు ఫ్యాన్ గుర్తుపై వేసి గెలిపించాలని కోరారు. 58 నెలల జగనన్న పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఇక్బాల్ బాషా, మండల అధ్యక్షుడు బుడ్డా చంద్రమోహన్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ బుడ్డా విష్ణువర్ధన్‌రెడ్డి, సర్పంచ్ మేకల ఓబులేస్, మండల కోఆప్షన్ మెంబర్ అమీర్ అహమ్మద్, రైతు సలహా మండలి చైర్మన్ పోచా రాదాకృష్ణారెడ్డి, సచివాలయ కన్వీనర్ లాలమ్మగారి హుసేని, నాయకులు బుడ్డా ఈశ్వరరెడ్డి, బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, ముసాని శివానందరెడ్డి, కొట్టాల భాస్కర్‌రెడ్డి, దండు మహమ్మద్ పాల్గొన్నారు.

టీడీపీ ముఖ్యనేత వైఎస్సార్‌సీపీలో చేరిక



శిల్పా మోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు

నంద్యాల(వ్యవసాయం): టీడీపీ ముఖ్యనేత షేక్ ఫరాస్ రహిమాన్ అతని అనుచరులు, కుటుంబ సభ్యులు మాజీ మంత్రి శిల్పా మోహన్‌రెడ్డి సమక్షంలో శనివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. షేక్ ఫరాస్ రహిమాన్ మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా టీడీపీకి సేవలందించినా గుర్తింపు లేకపోవడంతో, పేదలకు మంచి చేస్తున్న వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి మద్దతునివ్వాలని వైఎస్సార్‌సీపీలో చేరామన్నారు. పార్టీలో చేరిన వారిలో షేక్‌ఫరాస్ ఇమ్రాన్, షేక్ ఫరాస్ ఇర్ఫాన్, షేక్ ఇలియాస్, షేక్ నిజాముద్దీన్, షేక్ అసదుల్లా, షేక్ అసీఫ్, సయ్యద్‌గౌస్, సయ్యద్ మోసిన్, ఫయాజ్, కరీమ్ చేరారు. కౌన్సిలర్లు సాదిక్‌బాషా, హారీఫ్ నాయక్ పాల్గొన్నారు.

మేలు చేశాం..మళ్లీ ఆశీర్వదించండి



శిరివెళ్లలో ఇంటింటి ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే



కోటపాడులో ప్రచారం చేస్తున్న సారికారెడ్డి

శిరివెళ్ల: జగనన్న పాలనలో ప్రజలకు ఎంతో మేలు జరిగింది. పేదల సంక్షేమం. పంచాయతీలో అభివృద్ధి పనులు చేపట్టాం. మేలు చేశాం కావున తమను జరగనున్న ఎన్నికల్లో మళ్లీ ఓటు వేసి ఆశీర్వదించమని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రా రెడ్డి కోరారు. శనివారం స్థానిక 15,16 వార్డుల్లో ఇంటింటి ప్రచారం చేశారు. గంగుల విజయ సింహారెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ దిల్షాద్ బేగం, ఎంపీపీ నాయక్ వసీం, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బీ.అబ్దుల్ సలాం, పార్టీ మండల అధ్యక్షుడు ఇందూరి ప్రతాపరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నజీర్, సర్పంచు సాలమ్మ, హిస్టరీ అకాడమీ స్టేట్ డెరెక్టర్ హఫీజ్, ఉప సర్పంచు ఇంతియాజ్, దేవస్థానం చైర్మన్ దాదిరెడ్డి తిమ్మరాయుడు, ముడిమేల నాగరాజు, ఉల్లి సుబ్బరాయుడు, దొర్నిపాటి రఫీ, ముల్లా అన్వర్‌బాషా, గండికోట పార్థుడు, సముద్రాల సత్యనారాయణశ్రేష్టి, నాగరాజు, చంద్ర, ప్రతాప్, శివారెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించండి..

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రా రెడ్డి సతీమణి గంగుల సారికారెడ్డి కోరారు. శనివారం కోటపాడు, గాంధీనగరంలో ఇంటింటి ప్రచారం చేశారు. ఆమె మాట్లాడుతూ ఎంపీగా పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యేగా బిజేంద్రారెడ్డిని పోటీ చేస్తున్నారని చెప్పారు. మే 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేయాలని ప్రజలను అభ్యర్థించారు. వంకదార సుబ్బసత్యనారాయణశ్రేష్టి, మండల ఉపాధ్యక్షుడు కేడెం సాలరాజు, సర్పంచులు దూదేకుల ఉశేన్‌బీ, తలారి జానకీదేవి, ఉప సర్పంచు గురజాల లీలావతి, నాయకులు శ్రీనివాసులరెడ్డి, దూదేకుల గుర్రప్ప, గోపాల్‌రెడ్డి, చిన్న ఉశేనిరెడ్డి, నరసింహారెడ్డి, చింతకుంట శేషిరెడ్డి, మేర్వ రఘునాథరెడ్డి, రాజారెడ్డి పాల్గొన్నారు.

గుడిసె దగ్ధం

శిరివెళ్ల: గోవిందపల్లెలో శనివారం జరిగిన అగ్ని ప్రమాదంలో బోయ నారాయణమ్మకు చెందిన పూరి గుడిసె దగ్ధమైంది. ప్రమాదంలో కూలీ పని చేస్తూ దాచుకున్న రూ. 20 వేల నగదు, బియ్యం, బట్టలు కాలిపోయాయి. నంద్యాలకు చెందిన అగ్నిమాపక యంత్రం వచ్చి మంటలను ఆర్పి వేసింది. నిలువ నీడ బూడిదైందని బాధితురాలు కన్నీటి పర్యంతమైంది. బీడి వెలిగించి అగ్గి పుల్ల వేయడంతో మంటలు వ్యాప్తి చెంది గుడిసె కాలిపోయిందని ఫైర్ సిబ్బంది పేర్కొన్నారు.

గంగమ్మ ఉత్సవాలు ప్రారంభం

రుద్రవరం: మండలంలోని పెద్దకంబలూరులో శనివారం గంగమ్మ తిరునాల ఘనంగా ప్రారంభమైంది. ఇటీవల గ్రామ ప్రజలు విరాళాలు పోగు చేసుకొని నూతనంగా గంగమ్మ ఆలయం నిర్మించి గంగమ్మ అమ్మవారితో పాటు పోతురాజు విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. వేడుకలు పూర్తవగా.. ప్రస్తుతం ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. తొలిరోజు అమ్మవారికి విశేష పూజలు చేశారు. ఆదివారం ఉదయం అమ్మవారికి బోనాలు సమర్పిస్తామని గ్రామ పెద్దలు తెలిపారు.

స్వచ్ఛత వీడి.. స్వప్రయోజనానికి వాడి!



చిత్రేనిపల్లె-ఆలమూరు మధ్య స్వచ్ఛ ట్రైసైకిల్‌లో తరలిస్తున్న గడ్డి, అరటిపండ్లు

రుద్రవరం: గ్రామాల్లోని చెత్తా చెదారాన్ని తరలించేందుకు ప్రభుత్వం స్వచ్ఛ సంకల్పం పేరుతో గ్రామ పంచాయతీలకు ట్రై సైకిళ్లను అందించింది. వాటితో గ్రీన్ అంబాసిడర్లు నిత్యం ఉదయాన్నే ఇంటింటికీ తిరిగి తడి, పొడి చెత్తను సేకరించి చెత్త సంపద కేంద్రాలకు తరలించాలి. అయితే కొందరు ట్రై సైకిళ్లను సొంత ప్రయోజనాలకు వినియోగిస్తున్నారు. శనివారం మండలంలోని చిత్రేనిపల్లెకు చెందిన గ్రీన్ అంబాసిడర్ ట్రై సైకిల్‌లో గడ్డి, అరటి పండ్లు తరలిస్తూ కనిపించాడు. ఇదేమని ప్రశ్నించగా.. ఉదయాన్నే చెత్తను గ్రామ బయట వేసి పొలానికి వచ్చి పనులు చూసుకొని ఇంటికి అవసరమైనవి ఇందులోనే తీసుకెళ్తానని, ఇదేమి తనకు కొత్త కాదని, ట్రైసైకిల్ ఇచ్చినప్పటి నుంచి ఇలా చేస్తున్నానని చెప్పాడు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి ఆదిలక్ష్మిని వివరణ కోరగా.. ఇక నుంచి అలా జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రగతి పథంలో ఒకటో వార్డు

- సంక్షేమాభివృద్ధిలో పీవీ నగర్, హరిజనవాడకు పెద్ద పీట
- 30ఏళ్ల క్రితం స్థలాలు పొందిన వారికి పట్టాలతో పాటు ఇళ్ల నిర్మాణాలు
- కాలనీ వాసులకు డీబీటీ, నాన్‌డీబీటీ కింద రూ.26.86 కోట్ల లబ్ధి
- 276 మందికి 2.5 సెంట్ల చొప్పున భూమి పంపిణీ



ఆర్టీటీ ద్వారా నిర్మిస్తున్న ఇళ్లు



నిర్మాణ దశలో కమ్యూనిటీ టాయిలెట్లు

నంద్యాల(సిటీ): పట్టణంలోని 1వ వార్డు పీవీ నగర్, హరిజనవాడకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైభవం తీసుకొచ్చింది. 5,198 మంది నివాసం ఉన్న వార్డులో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పెద్ద పీట వేసింది. 58నెలల్లో వార్డులోని నీటి సమస్యను అధిగమించేందుకు రూ.11.80లక్షలతో మంచి నీటి పైప్ లైన్ నిర్మించారు. రూ.17లక్షలతో సీసీ డ్రైన్ నిర్మించి మౌలిక సదుపాయాలను కల్పించారు. గడప గడప సందర్భంగా వచ్చిన ఫిర్యాదులకు సత్వరమే పరిష్కారాన్ని చూపుతూ రెండు ప్రాంతాలలో రూ.20 లక్షలతో సీసీ రోడ్లను నిర్మించారు. కమ్యూనిటీ టాయిలెట్లను రూ.13లక్షలతో నిర్మిస్తున్నారు.

82 ఇళ్ల నిర్మాణాలకు కృషి..

ఇదే ప్రాంతంలో ఆర్టీటీ సహకారంతో 82 మంది లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలను గత సంవత్సరం చేపట్టింది. ఇళ్ల నిర్మాణాలకు ఆర్టీటీ నుంచి రూ.2.20లక్షలు, ప్రభుత్వం నుంచి రూ.1.80 లక్షలు అందించి వేగంగా గృహ నిర్మాణాలకు ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి కృషి చేశారు. ఇందులో 55గృహ నిర్మాణ పనులు పూర్తి కాగా మిగిలినవి చివరి దశలో ఉన్నాయి.

సంక్షేమంలోనూ భేష్..

వార్డులోని ప్రజలకు ఈ 58 నెలల కాలంలో 25 పథకాల ద్వారా డీబీటీ విధానంలో రూ.16.98కోట్లు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో ప్రభుత్వం జమచేసింది. నాన్ డీబీటీ కింద రూ.9.87కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టింది. మొత్తంగా 26.86 కోట్ల మేర అందింది.

276 మందికి ఇళ్ల పట్టాలు..

పట్టణంలో 30 సంవత్సరాల క్రితం పీవీ నరసింహారావు 276 మంది పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చి, వారికి సొంత ఇళ్లను నిర్మించారు. అయితే కాలానుగుణంగా సంభవించిన వరదలు, ఇతర కారణాలతో ఆయా ఇళ్లు మొత్త పూర్తిగా నేలమట్టమయ్యాయి. ఆ తరువాత పేదలను ప్రభుత్వాలు పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మరో మారు అదే పాత యజమానుల పేర్ల మీద పట్టాలను పంపిణీ చేసింది. ప్రతి ఒక్కరికీ రూ.12.5 లక్షల విలువైన రెండున్నర సెంట్ల స్థలానికి పట్టాలకు సంబంధించిన తహసీల్దార్ ఆఫీస్ ఫైల్ కాపీ ఆధారంగా నిజమైన లబ్ధిదారులకు పట్టాలు అందచేశారు.



కొత్తగా వేసిన సీసీరోడ్లు

స్థలాన్ని తిరిగి ఇవ్వడం హర్షణీయం



పీవీ నగర్‌లో 30 సంవత్సరాల క్రితం పీవీ నరసింహారావు మాకు ఇళ్ల పట్టాలు ఇవ్వడమే కాకుండా ఇళ్లను నిర్మించారు. అయితే వరదల కారణంగా ఆ ప్రాంతంతో నిర్మించిన ఇళ్లు కూలిపోయాయి. ఇప్పుడు మళ్లీ అదే స్థలంలో కొత్తగా ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి ఇంటిని నిర్మిస్తామని చెప్పి పట్టాలను అందించారు. 7 సంవత్సరాల పాటు కరువులో ఉన్నా చంద్రబాబు మమ్మల్ని పట్టించుకోలేదు. కానీ నేడు మా ఇంటి వద్దకే వచ్చి అన్నీ అందిస్తూనే మా సొంతింటి కలను సాకారం చేస్తున్న ఈ ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

– జీ.మద్దయ్య, 1వ వార్డు

సొంతింటి కల నెరవేరింది



గత 30 సంవత్సరాలుగా పీవీ నగర్ ప్రాంతంలో నివాసం ఉంటున్నాం. గతంలో పీవీ నరసింహారావు ఇచ్చిన ఇంట్లో చాలా ఇబ్బందులు పడ్డాం. కూలీ సంపాదనతో ఇళ్లు గడవడానికి సరిపోయేది కాదు. సొంతింటి కల నెరవేరుతుందని అనుకోలేదు. ఇంటి నిర్మాణానికి హౌసింగ్ ద్వారా ప్రభుత్వం నుంచి రూ.1.80 లక్షలు, ఆర్టీటీ ద్వారా రూ.2.20లక్షలు వచ్చేలా ఎమ్మెల్యే శిల్పా రవి చేశారు. సొంతింటి కల నెరవేరినందుకు సంతోషంగా ఉంది.

–పీ నాగలక్ష్మి, పీవీ నగర్, నంద్యాల

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



భూమా కిశోర్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలు

శిరివెళ్ల: మండలంలోని గంగవరంలో టీడీపీ, బీజేపీకి చెందిన 50 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో శనివారం చేరాయి. వీరికి భూమా కిశోర్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. చేరిన వారిలో కోలగాని ఈశ్వరయ్య, కంచర్ల పాములేటి, గిద్దలూరి చిన్నరాముడు, వంకెరాజు,తెలుగు ఉశేని, మల్లెల శ్రీనివాసులు, కంచర్ల శేఖర్, షేక్ మదార్ ప్రసాదు, వెంకటరమణ, వెంకటరామయ్య, వంటేరు ఆంజనేయులు, అట్ల మహేష్, రాజమ్మ, రాజేష్, నడిపి సుబ్బరాయుడు, దొడ్డి ఆంజనేయులు, మల్లె శ్రీనివాసులు, భాస్కర్, పేల సుబ్బరాయుడు, జంబులు, సుద్దుల శ్రీనివాసులు, సుద్దుల గోపాల్‌తో మరో 20 కుటుంబాలు పార్టీలో చేరాయి.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నంద్యాల(అర్బన్): పట్టణంలోని పద్మావతినగర్ ఏరియాలో ఆదివారం ఉదయం 7 నుంచి 9గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ శాఖ డి2 ఏఈ రామయ్య శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు, లూజు కనెక్షన్లను సరి చేసేందుకు సరఫరాను నిలిపివేస్తున్నామన్నారు. పద్మావతినగర్, కిచెన్‌గార్డెన్, వెలాసిటీ కాలేజీ, అక్షర డిగ్రీ కాలేజీ, నయన కంటి ఆసుపత్రి, ఇండోర్‌స్టేడియం ప్రాంతాల్లో సరఫరా నిలిచి పోతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఇన్‌టాచ్ సేవలు విస్తరించాలి



మాట్లాడుతున్న మహానంది ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి

నంద్యాల(వ్యవసాయం): దేశ వారసత్వ సంస్కృతి, సంప్రదాయాలు, పురాతన కట్టడాలను సంరక్షించి భావితరాలకు అందించే ఇన్‌టాచ్ (ఇండియాన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్స్ కల్చరల్ అండ్ హెరిటేజ్) నంద్యాల చాప్టర్ సేవలను గ్రామస్థాయికి విస్తరించాలని మహానంది ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. శనివారం స్థానిక యోగా కాన్సియస్ సెంటర్‌లో ఇన్‌టాక్ నంద్యాల కన్వీనర్, కో కన్వీనర్ శివరామిరెడ్డి, సేతురామన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఇన్‌టాక్ ఫౌండేషన్ ఢిల్లీ, నంద్యాల ఇన్‌టాచ్ చాప్టర్ ప్రయత్న ఫలితంగా అహోబిల నరసింహస్వామి పారువేటోత్సవాన్ని ప్రభుత్వ పండుగగా సర్కారు అధికారికంగా ప్రకటించిందన్నారు. చారిత్రక విషయాలు ముందు తరాలకు తెలియాలంటే యువతీ యువకులు ఇన్‌టాచ్ శాశ్వత సభ్యత్వం తీసుకోవాలని చెప్పారు. గోళ్ల సుదర్శనం, మారం శేషయ్య, ఆంజనేయులు, దామోదర్‌రెడ్డి, డాక్టర్ కార్తిక, లాయర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.